కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు

- మాడవీధుల్లో వేంకటేశ్వరస్వామిని ఊరేగించిన భక్తులు
- పాల్గొన్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, మార్చి 15 : బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో శుక్రవారం త్రిదండి దేవనాథరామానుజుల జీయర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్త, మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, సతీమణి పుష్ప పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు తీర్థ గోష్ఠి, విష్వక్సేన ఆరాధనం, ధ్వజారోహణం, మాడవీధుల్లో స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణ పూజా సమయంలో గరుడ పక్షులు ఆలయం చుట్టూ తిరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శంభురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మద్దినేని నాగేశ్వర్‌రావు, అప్పారావు, నర్స రాజు తదిత రులు పాల్గొన్నారు.

స్వామి వారిని ఊరేగిస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

లక్కీడ్రాలో ఇద్దరు విద్యార్థులు ఎంపిక

లక్కీడ్రా తీస్తున్న విద్యార్థి

కామారెడ్డి, మార్చి 15 : జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సమక్షంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 1వ తరగతి ప్రవేశాలకు లక్కీడ్రా నిర్వహించారు. ఇద్దరు బాలికలు సుంకరి బృందన, త్రిక్షణను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట్, మార్చి 15 : మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని శివాని మహిళా పొదుపు సంఘం సభ్యురాలు నాయిని రాధ పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా ఏర్పాటు చేసుకున్న పిండి గిర్నిని మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వీఈ జిల్లా అధికారి రాజేందర్, ఏపీఎం సాయిలు, ఎస్‌బీఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఇజ్రాయిల్, సీసీలు శ్రీనివాస్, మండల సంఘాల అధ్యక్షురాలు లక్ష్మి, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

భిక్కనూరు, మార్చి 15 : రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి దేవేందర్ తెలిపారు. మండలంలోని గుర్జకుంట గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 15వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది బాబా, సురేశ్, ప్రదీప్, మహేశ్, పంచాయతీ కార్యదర్శి రేణుక, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

దోమకొండ, మార్చి 15: తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు శివరాం తెలిపారు. తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరం 6 నుంచి 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల ప్రవేశానికిగాను అభ్యర్థులు www.tswreis.ac.in. వెబ్‌సైట్ ద్వారా మార్చి 4 నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాఠశాల వారి తరగతులు, కులాల వారి ఖాళీలను సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలకు సంబంధించి ఏవైనా సందేశాలు ఉంటే సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.

ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌తో వీధిన పడుతున్న కుటుంబాలు

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

- కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 15 : సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువవుతున్నాయని, అవసరం మేరకే వినియోగించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశం మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో పలుయాప్‌లు చేస్తున్న గ్యాంబ్లింగ్‌తో కుటుంబాలు వీధిన పడుతున్నాయని అన్నారు. ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని, యువత అప్రమత్తంగా యాప్‌లను ఉపయోగించాలని సూచించారు. వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం 2019లో వినియోగదారుల రక్షణ చట్టం తెచ్చిందని చెప్పారు. నష్టపోతే ఈ చట్టం ద్వారా పరిహారం పొందే హక్కుతోపాటు వస్తువు ఎంపిక చేసుకునే హక్కు, భద్రత, సమాచారం, విద్య, ఆరోగ్య హక్కులు పొందవచ్చని అన్నారు. సమావేశంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బావయ్య, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు రఘునందన్, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం, వినియోగదారుల ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

పెరిక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

దోమకొండ, మార్చి 15 : రాష్ట్ర ప్రభుత్వం పెరిక కార్పొరేషన్‌కు రూ.పదివేల కోట్ల నిధులను కేటాయించాలని పెరిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిన్నం రాంచంద్రం అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం పెరిక కులస్తులను గుర్తించి వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నస్రుల్లాబాద్, మార్చి 15 : మండలంలోని నెమ్లి గ్రామంలో ఉంటున్న నాగవ్వకు చెందిన ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైనట్లు ఆర్‌ఐ హన్మాండ్లు తెలిపారు. ఇంట్లో ఉన్న నిత్యవసర పస్తువులు, వలలు, సైకిళ్లు కాలిపోయాయని, సమారు రూ.లక్షా 20 వేల ఆస్తి నష్టం సంభవించినట్లు ఆయన తెలిపారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

బాన్సువాడ రూరల్, మార్చి 15 : ప్రజలు బకాయిలు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని బోర్లం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంఈవో నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఇంటి పన్ను వసూలు చేస్తూ రశీదులను అందజేశారు. తిర్మలాపూర్‌లో మరో పంచాయతీ కార్యదర్శుల బృందం పన్నులు వసూలు చేసింది. పంచాయతీ కార్యదర్శులు సాయికుమార్, శ్రీధర్‌రెడ్డి, పండరి, అవినాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వివరణ ఇవ్వాలి

కామారెడ్డి, మార్చి 15 : జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మందాపూర్, బీబీపేట్ మండలంలో ప్రైవేట్ వ్యక్తులు పాఠశాల విద్యార్థులతో కలిసి ఈ నెల 1, 15 వ తేదీల్లో వీడియో షూటింగ్ తీశారని డీఈవో రాజు తెలిపారు. దీని గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రైవేట్ వ్యక్తులతో షూటింగ్ తీయడానికి అనుమతి ఇవ్వడం, పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం చేయడం నిబంధనలకు విరుద్ధం, పాఠశాల ప్రధానోపాధ్యాడు బీబీపేట్ మండలాధికారికి వివరణ ఇవ్వాలని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, మార్చి 15 : తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ శిక్షణ కేంద్రంలో యూపీఎస్సీ సీశాట్ 2024–25 సంవత్సరానికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 100 మంది డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైను, బుద్దిస్ట్, పార్శి) అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరిలో దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఇతర విద్యా సంస్థల్లో ఏ రకమైన కోర్సు, ఉద్యోగం చేయకుండా, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5 లక్షలకు మించి ఉండరాదని తెలిపారు. అర్హులైన వారు ఏప్రిల్ 12వ తేదీ వరకు www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీ ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 040–23236112 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

డీసీసీబీ చైర్మన్‌ను కలిసిన బీఆర్ఎస్ బాన్సువాడ పట్టణ నూతన కార్యవర్గ సభ్యులు

బాన్సువాడ టౌన్, మార్చి 15 : పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ బాన్సువాడ పట్టణం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్‌గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఎజాస్, దొడ్డ వెంకట్‌రాంరెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీధర్, వాహబ్, ఆత్మకమిటీ చైర్మన్ మోహన్‌నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

బాన్సువాడ రూరల్, మార్చి 15 : మండలంలోని బోర్లం గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నల్లోల సాయిలు, నాయకులు అనిల్‌కుమార్, సాయిలు, బాలు, ఐకేపీ సాయిలు, గంగారాం, సచిన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హన్మాజీపేట్ తైబజార్ వేలం

బాన్సువాడ రూరల్, మార్చి 15 : మండలంలోని హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రాజేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం తైబజార్‌కు వేలం నిర్వహించారు. వార సంతను రూ.59వేలకు కాంట్రాక్టర్లు వేలంలో దక్కించుకున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే తైబజార్‌ను రద్దు చేస్తామని కార్యదర్శి తెలిపారు. వేలంలో గ్రామపెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మాచారెడ్డి, మార్చి 15 : పాల్వంచ మండలంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు గురు గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ కేశిరెడ్డి గురువేందర్‌రెడ్డి శుక్రవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవర్ధన్, ఆర్యభట్ట ప్రిన్సిపాల్ హన్మంత్‌రావు, విజయ్‌కుమార్, సత్యనారాయణ, నరేశ్‌గౌడ్, కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15: తాము వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని మీసేవ, ఫొటో స్టూడియో, ఆన్‌లైన్ సెంటర్లు, చిరు వ్యాపారస్తులు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌ను వారు శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. తమ వ్యాపారాల్లో అనుబంధంగా జిరాక్స్ సెంటర్లు ఉన్నాయని, దీంతో పదో తరగతి పరీక్షలు నిర్వహించే సమయంలో వ్యాపారాలను మధ్యాహ్నం వరకు మూసి ఉంచాలని తహసీల్దార్ ఆదేశాలు ఇచ్చారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ఇంటర్ పరీక్షల కోసం దుకాణాలు మూసి ఉంచామని, ఇప్పుడు పదో తరగతి పరీక్షల కోసం మూసి ఉంచడంతో తాము నష్టపోతామని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. దుకాణ అద్దె చెల్లించడం, కుటుంబ పోషణ భారంగా మారుతుందని వాపోయారు. పరీక్ష సమయంలో తాము జిరాక్స్‌లు తీయమని, తమ వ్యాపారాలు నడుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

మండలంలో 13వేల ఎకరాల్లో పంటల సాగు

ఎల్లారెడ్డి, మార్చి 15: మండలంలో 13వేల ఎకరాల్లో రైతులు పలు రకాల పంటలను సాగుచేశారని ఏవో అనిల్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని 13,699మంది రైతులకు 12,880మందికి రైతుబంధు డబ్బులు రూ.6.39కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఏవో వివరించారు. పలు శాఖల అధికారులు తమ నివేదికలను సభకు వివరించారు. సమావేశంలో ఎంపీడీవో రాణి, తహసీల్దార్ మహేందర్, జడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

'డబుల్' ఓట్లను తొలగించాలి

సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాసాగర్

సదాశివనగర్, మార్చి 15: మండలంలో ఒకరికి రెండు ఓట్లు ఉంటే జాబితా నుంచి తొలగించాలని తహసీల్దార్ గంగాసాగర్ బీఎల్వోలకు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు లిస్టులో తప్పులు లేకుండా చూడాలన్నారు. సమస్యలు ఉంటే మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఖాజా షరీఫ్, సాహితి, బీఎల్వోల మండల సూపర్‌వైజర్ లింగాపురం రాజు. ధర్మపురి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతపై విద్యార్థుల ప్రదర్శన

ఓటు ఇంగ్లిష్ అక్షరమాల క్రమంలో కూర్చున్న విద్యార్థులు

పిట్లం, మార్చి 15: మండలంలోని చిల్లర్గి, రాంపూర్ జిల్లాపరిషత్ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులు ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిసింగ్, విఠల్, రాజు, నబీ, మల్లేశ్, శ్రీనివాస్, సీఆర్పీ గోపాల్ పాల్గొన్నారు.

క్రీడలపై యువత ఆసక్తి కలిగి ఉండాలి

పిట్లం, మార్చి 15: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, యువత ఆటలు ఆడేందుకు ఆసక్తిని చూపాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు బొడ్ల రాజు ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఎల్‌కేఆర్ షటిల్ టోర్నీ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, మోహన్‌రెడ్డి, మురళీగౌడ్, జంబిగె హన్మాండ్లు, శపథంరెడ్డి, దయానంద్, మొగులాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి

గాంధారి, మార్చి 15: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో మునిగి మృతిచెందిన ఘటన మండలంలోని రాంపూర్‌గడ్డలో చోటు చేసుకున్నది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన ప్రకారం.. రాంపూర్‌గడ్డ తండాకు చెందిన రత్లావత్ హరి(40) గురువారం రాత్రి ఇంట్లోని దోమల తెరను తీసుకొని పోతంగల్ కలాన్‌లోని యాతం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. చెరువులోకి దిగిన ఆయన నీటిలో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, భార్య సాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సౌదీలో సదాశివనగర్‌వాసి మృతి

స్వగ్రామానికి చేరిన మృతదేహం

నారాయణ(ఫైల్)

సదాశివనగర్, మార్చి 15: మండల కేంద్రానికి చెందిన పుల్లబోయిన నారాయణ జనవరి 20వ తేదీన సౌదీలో మృతిచెందినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. నారాయణ సౌదీలోని అయిల్ ప్రాంతంలో తోటమాలిగా పనిచేస్తున్నాడు. జనవరి 20వ తేదీన గుండెపోటుతో మృతి చెందగా.. 15రోజుల అనంతరం కపిల్ గమ నించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబీకులు గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక సంస్థ సభ్యుడు మహ్మద్ ఫారుక్‌ను కలిసి మృతదేహాన్ని తెప్పించాలని కోరారు. ఆయన సౌదీ అధికారులతో మాట్లాడి.. ఇండియన్ ఎంబసీ సహకారంతో శుక్రవారం సదాశివనగర్‌కు తెప్పించారు. ఎన్నారై అధికారి చిట్టిబాబు సహకారంతో విమనాశ్రయం నుంచి స్వగ్రామానికి తీసుకువచ్చారు. నర్సింహులు, పెరిక రాజేందర్, రాంచందర్‌గౌడ్, రియాజ్ సహకారం అందించారని గ్రామస్తులు తెలిపారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలం

వేలం నిర్వహిస్తున్న ఆర్ఐ రవీంద్రనాథ్

బిచ్కుంద, మార్చి15: అనుమతి లేకుండా తరలిస్తుండగా పట్టుబడ్డ ఇసుకకు అధికారులు శుక్రవారం వేలం నిర్వహించారు. ఈనెల 11వ తేదీన పది ఇసుక ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బిచ్కుంద ఎస్సై మోహన్‌రెడ్డి కలిసి పట్టుకున్నారు. పట్టుబడ్డ ఇసుకకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వీటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.36,400 ఆదాయం సమకూరిందని తెలిపారు. తహసీల్దార్ సురేశ్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒంటిపూట బడులు షురూ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15: ఒంటిపూట బడులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయని ఎంఈవో వెంకటేశం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు తరగతులు కొనసాగుతాయన్నారు. 12–30గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తారని తెలిపారు. ఎస్సెస్సీ పరీక్షలు నిర్వహించే పాఠశాలలు మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందని ఎంఈవో తెలిపారు.

ఈ-కేవైసీపై అవగాహన

నిజాంసాగర్, మార్చి15: మండలంలోని వొడ్డేపల్లి రైతు వేదికలో శుక్రవారం ఏఈవో రేణుక రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కోసం ఈ–కేవైసీ చేయించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. మల్లూర్ క్లస్టర్‌లో 24 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోలేదని తెలిపారు. కొమలంచ గ్రామంలో ఏఈవో మధు రైతులకు ఈ–కేవైసీపై అవగాహన కల్పించారు.

పాదయాత్రకు స్వాగతం

సదాశివనగర్, మార్చి 15: భువనగిరి జిల్లా కొలనుపాక ఆలయం వరకు మహా పాదయాత్ర చేస్తున్న భక్తులకు శుక్రవారం మండలంలోని అంబరీశుని ఆలయ ఆవరణలో మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మహాదేవుని గుట్ట నిర్వాహకుడు జయదేవ్ మహారాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్ర 22వ తేదీన కొలనుపాకకు చేరుకుంటుంది.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ధోతిలో గేదెకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి వినీత్‌కుమార్

మద్నూర్/ డోంగ్లీ/ ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15: ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. రైతులు తమ పశువులకు తప్పకుండా టీకాలను వేయించుకోవాలని ఈ సందర్భంగా పశు వైద్యాధికారులు, సిబ్బంది సూచించారు. మద్నూర్ మండలంలోని మేనూర్, మద్నూర్‌లోని గోశాలలో పశువులకు పశువైద్యాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో టీకాలను వేశారు. శనివారం అవల్‌గావ్, శేఖాపూర్ గ్రామాల్లో టీకాలు వేస్తామని తెలిపారు. డోంగ్లీ మండలంలోని ధోతి గ్రామంలో పశువైద్యాధికారి వినీత్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలను పంపిణీ చేశారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యోగేశ్, పశువైద్య సిబ్బంది భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండలంలోని అడ్విలింగాల్ గ్రామంలో మత్తమాల పశువైద్యాధికారి డాక్టర్ అర్చన 113 గేదెలు, 13 ఆవులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు సాయిరెడ్డి, మహబూబ్, అటెండర్లు రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నిజాంసాగర్, మార్చి 15: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, నిజాంసాగర్ మండల వైద్యాధికారి రోహిత్‌కుమార్, మన కోసం మనం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కిశోర్‌కుమార్ అన్నారు. అచ్చంపేట మోడల్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

గాంధారి, మార్చి 15: రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి సొసైటీ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని గండివేట్ సొసైటీలో అందుబాటులో ఉన్న ఎరువుల బస్తాలు, స్టాక్ రిజిస్టర్, ధరల పట్టికను తనిఖీ చేశారు. క్రయవిక్రయాల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని విండో కార్యదర్శి కృష్ణారెడ్డికి సూచించారు. అనంతరం గ్రామ శివారులో రైతులు సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఎల్లారెడ్డి బస్టాండ్, వంద పడకల దవాఖాన, ఉప్పల్‌వాయి–బాన్సువాడ రోడ్, గాంధారి–చద్మల్ రోడ్ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులకు నిధులను మంజూరు చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించడంతో కృతజ్ఞతలు తెలిపారు.